బలగం BALAGAM TV
balagamtv100@gmail.com

# జిల్లాలో ఎరువుల కొరత లేదు

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: జిల్లాలో పంటల సాగుకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, ఎరువుల కొరత లేదని,రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.జిల్లాలో ఎరువుల సరఫరా, నిల్వలు, విక్రయాలు, నిర్వహణ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ గరిమ అగ్ర వాల్ , అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో పాటు మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సహకార, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖల అధికారులతో ఎరువుల లభ్యతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత పంటల సాగుకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంటల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన ఎరువులను ముందుగానే జిల్లాలోనే నిల్వ చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎరువుల కొరత ఏర్పడకుండానిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు తమ పరిధి లోని అన్ని ఎరువుల విక్రయ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. ఎరువుల నిల్వలు, ధరల పట్టిక, విక్రయాల వివరాలను పరిశీలించి అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు సులభంగా అందేలా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలనిసూచించారు.ఈ సమావేశంలో డీఆర్ డీఓ లక్ష్మీనారాయణ, జిల్లావ్యవసాయశాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ,మార్క్‌ఫెడ్‌డీఎం హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# 30 ట్రాక్టర్లతో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా త్రివర్ణ పతాక ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు జాతీయ జెండాలను పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేకంగా 30 ట్రాక్టర్లతో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను స్మరించుకోవడం, జాతీయ జెండాపై గౌరవ భావాన్ని పెంపొందించడం, దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లక్ష్యమన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి భారతదేశం ప్రతీక అని, భాషలు, ప్రాంతాలు, సంస్కృతులు వేరైనా దేశ ప్రజలందరినీ ఏకం చేసేది త్రివర్ణ పతాకమేనని పేర్కొన్నారు.బీజేపీ జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కేవలం కార్యక్రమం కాదని, ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయ భావాన్ని బలోపేతం చేసే ప్రజా ఉద్యమమన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను ప్రతి తరం స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు.ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశంపై తమకున్న గౌరవాన్ని చాటాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా కేవలం వస్త్రం కాదని.. దేశ గౌరవం, స్వాభిమానం, స్వాతంత్ర్యానికి ప్రతీక అని అన్నారు. యువత, మహిళలు, విద్యార్థులు, ప్రతి కుటుంబం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్ర మహేష్, లింగంపల్లి శంకర్, కుమ్మరి శంకర్, కౌడిపల్లి గోపాల్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్లు ఆడెపు రవీందర్, దశరథం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కరెడ్ల మధుకర్, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడీ పాలనకు చరమగీతం పాడాలి

- 'బద్లావ్ జరూరీ హై' నినాదంతో ప్రజా ఉద్యమం
- సెప్టెంబర్ 1న ఢిల్లీలో చలో రామ్‌లీలా మైదాన్.. సీపీఐ జాతీయ సమితి పిలుపు..





బలగం టీవీ, గంభీరావుపేట: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని,. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజలను చైతన్యపరిచేందుకు సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా 'బద్లావ్ జరూరీ హై' (మార్పు కావాలి) నినాదంతో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రను చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకు, ఆచరణకు పొంతన లేదని అన్నారు . ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా యువతకు ఆ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభించలేదన్నారు. విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని చెప్పినా ఆ హామీ అమలు కాలేదని ఆరోపించారు.పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని అన్నారు. ధరలను నియంత్రించడంలో కేంద్రం విఫలమైందని,పెరిగిన ధరల ప్రభావం పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రంగా పడుతోందన్నారు.రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతు ఉద్యమాల సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని అన్నారు. కేంద్రం తగినన్ని నిధులు కేటాయించి ఉపాధి హామీ పనిదినాలను పెంచాలని డిమాండ్ చేశారు.దేశంలోని సహజ వనరులను పెద్ద కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరిస్తోందని అన్నారు . దేశ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కాకుండా ప్రజల ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు వామపక్ష శక్తులు నిరంతరం పోరాడుతున్నాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులకు సామాజిక న్యాయం అందేలా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామనిఅన్నారు . కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు హౌ తెలిపారు. సీపీఐ శ్రేణులు, రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.'బద్లావ్ జరూరీ హై' నినాదంతో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



# సరిహద్దులు దాటిన 'జిగిరి'.. కన్నడనాట తెలంగాణ జీవన పరిమళం

- బెంగళూరులో పెద్దింటి అశోక్‌కుమార్ 'జిగిరి' కన్నడ అనువాద నవల ఆవిష్కరణ



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల : ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రచించిన 'జిగిరి' నవల కన్నడ అనువాద ఆవిష్కరణ సభ బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో ఘనంగా జరిగింది. నేలా ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ కళా సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.తెలుగు సాహిత్యంలో విశేష ఆదరణ పొందిన 'జిగిరి' నవలను రాజన్న తగ్గి కన్నడలోకి అనువదించారు. గతంలో ప్రముఖ రచయిత కలుమంగి కృష్ణమూర్తి ఈ నవలను కన్నడలోకి అనువదించగా, 'తరంగ' వారపత్రికలో ధారావాహికగా ప్రచురితమై కన్నడ పాఠకుల నుంచి విశేష ఆదరణ పొందింది. తాజాగా మరోసారి కన్నడలోకి అనువాదం కావడం విశేషంగా నిలిచింది.ఇప్పటికే 'జిగిరి' నవల పది భాషల్లోకి అనువాదం కావడం సాహితీ ప్రపంచంలో అరుదైన ఘనత అని ,తెలంగాణ సంస్కృతి, గ్రామీణ జీవన విధానం, ప్రజల ఆత్మీయత, మానవ సంబంధాలను ప్రతిబింబించే ఈ నవల కన్నడ పాఠకులకు తెలంగాణ జీవన వైవిధ్యాన్ని పరిచయం చేసిందని ప్రశంసించారు. ఒకే భాషలో ఒక రచన రెండుసార్లు అనువాదం కావడం అరుదైన విషయమని సభలో వక్తలు ప్రశంసించారు .ఇక్కడ సీనియర్ సాహితీవేత్త ఓఎల్ నాగభూషణ స్వామి, కన్నడ అభివృద్ధి ప్రాధికార మాజీ అధ్యక్షుడు ఎస్జీ సిద్ధరామయ్య, కన్నడ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ఎల్ఎన్ ముకుందరాజ్, ఎంఎస్ అకాడమీ ప్రతినిధి బిజె రంగనాథ్, ప్రముఖ రచయిత పి. లంకేశ్, నేలా పబ్లికేషన్స్ అధినేత బి. కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలి..



- డీఎస్పీ నాగేంద్రచారి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల : నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు.సిరిసిల్ల విద్యానగర్‌లోని నారాయణ పాఠశాలలో ఇన్వెస్టిచర్ సెరిమనీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల్లో హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌తో పాటు వివిధ బాధ్యతలకు ఎంపికైన విద్యార్థులతో ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ..విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, క్రమశిక్షణను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఎన్నికల ద్వారా నాయకులను ఎన్నుకోవడం, అనంతరం వారు బాధ్యతలు స్వీకరించడం విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి, డీజీఎం వెంకటరమణారెడ్డి, ఏజీఎం చైతన్యరావు, ఆర్ఐ సత్యంరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన శాంతికిరణ్, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పాసికంటి రాజేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ



బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శుక్రవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పోలీస్ పరేడ్ మైదానంలో వేదిక నిర్మాణం, పరేడ్ నిర్వహణ, వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సీటింగ్, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రవి, ఆర్ఐలు మధుకర్, సురేష్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

